క్లుప్తంగా

గణపతి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే కాలేరును సన్మానిస్తున్న దృశ్యం

నల్లకుంట: న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్‌లేన్‌లోని శ్రీ గణపతి వీరాంజనేయ దేవాలయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. గణేష్ రెడ్డి, సీహెచ్. సాయిమోహన్ కె. గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం భాగ్యనగరం సహకారంతో బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి నిరుద్యోగ యువతీయువకులకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి ఔత్సాహితులు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమోతో పాటు రెండు పాస్ ఫోటోలు తీసుకురావాలని సంస్థ నిర్వాహకులు కె.ఉపేందర్ వివరించారు. మరిన్ని వివరాలకు 9701992777.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



దోభీఘాట్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని దోభీఘాట్ బస్తీల విజ్ఞప్తి మేరకు బుధవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి ఆమె పర్యటించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, నేతలు ఉమేష్, రహమత్‌అలీ, ఆనంద్‌రావు, జలమండలి మేనేజర్ కృష్ణమోహన్, ఏఈ అబ్దుల్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌లు పాల్గొన్నారు.

నిరాండంబర దర్శకుడు రేలంగి



సత్కరిస్తున్న శాసనమండలి సభ్యుడు మధుసూదనాచారి తదితరులు

చిక్కడపల్లి: కుటుంబ కథా చిత్రాలు దర్శకుడిగా పేరు పొందిన రేలంగి నరసింహారావు అహంకారం లేని నిరాడంబర దర్శకుడని తెలంగాణ శాసనమండలి సభ్యుడు మధుసూదనాచారి ప్రశంసించారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై చంద్ర తేజాలయ మ్యూజిక్ అకాడమీ శాంతా వసంత ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతిని పురస్కరించుకుని చంద్రతేజ, రేవతి, కల్యాణి, పవన్, శ్రీదేవీలు అక్కినేని చిత్రాలలోని గీతాలను మధురంగా ఆలపించారు. కరీంనగర్‌కు చెందిన గాయకులు భక్తిపాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి పాల్గొని రేలంగి నరసింహారావును సత్కరించి మాట్లాడారు. జంధ్యాల తరువాత హాస్య కథ చిత్రాలకు దర్శకత్వం వహించిన నరసింహారావు అక్కినేని వంటి పెద్దల మన్ననలు అందుకున్నారన్నారు. లంక లక్ష్మీనారాయణ, కళా రఫీ, కిన్నెర రఘురాం, సంస్కృతి అభిమాని రాధాకృష్ణ తదితరులున్నారు.

నూతన బాధ్యతల స్వీకరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టిన మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణను వాకర్స్ సభ్యులు బాగ్‌లింగంపల్లిలోని తన నివాసం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న రాజ్యాంగబద్ధమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, వాకర్స్ ముఖ్య సలహాదారులు వెంకటకృష్ణారావు, ఎం.దామోదర్‌రెడ్డి, రఫీ అహ్మద్, వేణుగోపాల్‌రావు, ఉమామహేశ్వర్ తదితరులున్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు

రూ.కోటి ఆరు లక్షలతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్: నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్‌లోని ఉన్నికోటలో రూ.36 లక్షలు, దోమలగూడ గగన్ మహల్ స్ట్రీట్ నెంబర్ 10 శివప్యాలెస్ రోడ్డులో రూ.23.75 లక్షలతో సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీడీపీ) ఎమ్మెల్యే బడ్జెట్ నిధులతో దోమలగూడ ఈ సేవాపార్కులో రూ.30 లక్షలతో పార్కులో షెడ్డు, కాంపౌండ్ వాల్, కనీస సౌకర్యాలు, పురాతన నవశక్తి వ్యాయామశాల భవనం స్థలంలో రూ.26 లక్షలతో జీ ప్లస్ వన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ ఆధునీకరించిన తరువాతే సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనేక రోజులుగా ఉన్నికోట, స్ట్రీట్ నెంబర్‌లలో గుంతలమయమైన రోడ్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన సీసీరోడ్లతో సమస్య తీరిపోనుందన్నారు.

స్థానికుల విజ్ఞప్తి మేరకు..

దోమలగూడ ఈ సేవా సమీపంలోని పార్కులో షెడ్లు, కనీస సౌకర్యాలు, చుట్టు ప్రహరీ నిర్మాణ పనులకు పక్కనే ఉన్న నవశక్తి వ్యాయామశాల పురాతన భవన స్థలంలో జీప్లస్ వన్ నూతన భవన నిర్మాణానికి నియోజకవర్గం డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద నిధులు కేటాయించామన్నారు. ముషీరాబాద్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు శక్తివంచన లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

- బస్తీలు, కాలనీలలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చోట జనాభాకనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎస్.డీ.సాయికృష్ణ, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజు, బీఆర్ఎస్ నేతలు రాంచందర్, రాజశేఖర్‌గౌడ్, రాజేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, గండు వెంకటేష్, మధు, ఎం.ప్రభాకర్, రవియాదవ్, శివ, బీజేపీనేతలు రమేష్‌గౌడ్, కుమార్‌గౌడ్, అనిల్, మున్సిపల్ ఈఈ సన్నీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆయా బస్తీల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అంబర్‌పేట: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కార్పొరేటర్లతో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పండుగకు ప్రభుత్వం ప్రత్యేక గౌరవం ఇచ్చి ఘనంగా జరిగేలా చేయూతనిస్తుందన్నారు. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే నాటికి చీరల పంపిణీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, మహాలక్ష్మి, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యం ప్రథమ లక్ష్యం ప్రజా క్షేమం

చిక్కడపల్లి: ఏ కాలంలోనైనా సాహిత్యం ప్రథమ లక్ష్యం ప్రజా క్షేమమేనని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. వాల్మీకి రామాయణం, వ్యాస మహాభారతం నాటి కాలంలో ప్రజల కోసమే కాగా.. ఆధునిక కవిత్వం కూడా ప్రజా కవిత్వమేనన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై సాహితీ జిగీష సాహిత్య సంస్థ నిర్వహణలో డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి రచించిన స్వాతంత్ర్యోత్తర కాల మునందలి ప్రజా కవిత్వ పరిశోధన గ్రంథాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం అనంతరం వివిధ వాదాలలో సాహిత్యం వెలువడుతుందని, ప్రస్తుతం ఎవరైనా కవిత్వం రాయగల స్థాయికి చేరిందన్నారు. కాళోజీ వాక్కే కవిత అయినదని దిక్కర కవిగా గుర్తింపు పొందిన ఆయన జయంతిని రాష్ట్రం అధికారికంగా నిర్వహించడం సరైందేనన్నారు. సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ ఎం.దత్తాత్రేయ, సాహితీవేత్త ఆచార్య సుమతీ నరేంద్ర, ఆధ్యాత్మికవేత్త ఎం.వెంకటశర్మ, విజయలక్ష్మి, డాక్టర్ లలితావాణి, డాక్టర్ ఉమాశశీ, ఉషాలక్ష్మి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం



అవగాహన కల్పిస్తున్న నార్కొటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు

కాచిగూడ: మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని తెలంగాణ యాంటి నార్కొటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా యువత జాగ్రత్తగా మెలగాలన్నారు. వీటికి అలవాటు పడితే జీవితం గాడితప్పుతుందని, భవిష్యత్తు అంధకారమవుతుందని వివరించారు.

- మాదకద్రవ్యాల ముప్పు.. నివారణపై' కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మిషన్ పరివర్తన పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, ఎస్సై సుభాష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత తదితరులున్నారు.

జాషువా సాహిత్యం బలహీన వర్గాల ఆవేదన



ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్న అతిథులు

చిక్కడపల్లి: గుర్రం జాషువా సాహిత్యం దళిత బలహీనవర్గాల ఆవేదన అని ప్రముఖులు పేర్కొన్నారు. త్యాగరాయగానసభలో బుధవారం జ్యోతి ఆర్ట్స్ ఫౌండేషన్, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్, ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జాతీయ సాహితీ కళాసేవా ప్రతిభా పురస్కారాలను వివిధ రంగాల ప్రముఖులకు ఈ సభలో ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్ట్ శంకరనారాయణ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్.నాళేశ్వరం మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ సంప్రదాయ కవిత్వం రాస్తున్న సమయంలో జాషువా వాడుకబాషలో పద్యరచన సులభశైలిలో చేశారని వివరించారు. ఆలూరి విల్సన్, సరోజ, దేవసేన, అంజనీకుమార్, జ్యోతి, ఇందిర, శ్రీనివాస్‌నాయుడు, శర్మ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం

సికింద్రాబాద్: డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. టీఆర్‌టీ క్వార్టర్స్‌లో చేపట్టిన పూడికతీత పనులు ఆమె పర్యవేక్షించిన అనంతరం మాట్లాడారు. వీధుల పరిశుభ్రత కోసం దళితబంధు పథకం ద్వారా ప్రత్యేక స్లిట్ కార్డింగ్ వాహనం కేటాయించబడిందని ఈ వాహనం ద్వారానే పూడికతీత, మట్టి తొలగింపు పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అన్విత్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

బీజేపీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం



చంద్రకళను తిరిగి పార్టీలోకి చేర్చుకుంటున్న డాక్టర్ గౌతమ్‌రావు

అంబర్‌పేట: బీజేపీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. గతంలో పార్టీలో పనిచేసిన చంద్రకళ బీఆర్ఎస్ పార్టీలో చేరింది. ఆమె తిరిగి బుధవారం గౌతమ్‌రావు సమక్షంలో బీజేపీలోకి వచ్చింది. ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల బీజేపీలో పనిచేసి బీఆర్ఎస్ పార్టీలో ఇమడలేకపోయానని, తల్లి లాంటి పార్టీలో తిరిగి చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. గోల్నాక బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్, మూల రవీందర్‌గౌడ్, కె.నర్సింగ్‌రావుయాదవ్, రమేష్, రవీందర్, రాజేష్ తదితరులున్నారు.

బధిరుల జీవితాలు మెరుగుపరిచేందుకు సమిష్టి కృషి



ప్రపంచ సంకేత భాషా దినోత్సవంలో బధిర చిన్నారులతో అతిథులు

నల్లకుంట: బధిరుల జీవితాలు మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్) ఇన్‌స్ట్రక్టర్ రాస్‌జోగ్ అన్నారు. బధిరుల హక్కుల కోసం అంతా కలిసి సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. నల్లకుంట డీడీఎంఎస్ డీడీవీటీఆర్‌సీ స్పెషల్ స్కూల్‌లో బుధవారం ప్రపంచ సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాస్‌జోగ్ మాట్లాడుతూ.. మనం ఎవరికైనా విషయం చెప్పాలంటే భాష, వినడంతో పాటు మాట్లాడాలని చెప్పారు. కాని బధిరుల పరిస్థితి వేరని, వాళ్లు వినలేరు, మాట్లాడలేరని, అలాంటి బధిరుల కోసం పుట్టినదే సంకేత భాష అని చెప్పారు. సంకేత భాషలో చేతులు, కాళ్లతో పాటు కళ్లు, ముఖ కవళికలు, శరీర హావభావాలు కీలకమన్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. బధిరులు కూడా అందరిలాగే అన్ని విషయాలు తెలుసుకోవాలని, అది వాళ్ల జన్మహక్కని ఐక్యరాజ్య సమితి సంకేత భాషను ప్రోత్సహిస్తోందన్నారు. సంకేత భాష శిక్షకులు ఆనంద్, సంజయ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల ఫలితాలు ప్రకటించాలి

ముషీరాబాద్: మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన 5,204 స్టాఫ్ నర్సు పోస్టులతో పాటు ఆరోగ్యశాఖ ద్వారా ఆమోదం పొందిన 1,827 పోస్టులను కలిపి మొత్తం 7,031 పోస్టుల ఫలితాలను ప్రభుత్వం ప్రకటించాలని స్టాఫ్ నర్సు జేఏసీ నాయకులు వెంకటేష్, సంతోష్, గోవర్ధన్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ స్టాఫ్ నర్సుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్ బోర్డు 5,204 స్టాఫ్ నర్సులకు పరీక్షలు నిర్వహించి అనంతరం మరో 1,827 పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదించిందన్నారు. 2017లో 1,197 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి తరువాత మరికొన్ని పోస్టులను కలిపి 3,911 పోస్టులకు ఫలితాలు ఇచ్చిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సూర్యకుమార్, నిర్మల, సబిత, అనిత, శ్రావంతి, మీనాక్షి, భవాని, రజని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో బుజ్జగింపులు షురూ!



మంత్రి తలసాని నివాసంలో అంబర్‌పేట బీఆర్ఎస్ అసమ్మతి నేతలు

అంబర్‌పేట: అధికార పార్టీ బీఆర్ఎస్ పార్టీలో బుజ్జగింపుల పర్వం ప్రారంభమైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి ముందే నియోజకవర్గంలో అసమ్మతులను చల్లార్చేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రంగంలోకి దిగారు. బుధవారం మంత్రి నివాసంలో అసమ్మతి నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు లేవనెత్తిన అంశాలను ఆయన క్షుణ్ణంగా విని, పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేక సమయం మీకోసం తీసుకుని న్యాయం జరిగేలా మంత్రి తలసాని అసమ్మతి నేతలను సముదాయించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ దూసరి లావణ్య, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, గరిగంటి శ్రీదేవి పులిజగన్, సీనియర్ నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, గరిగంటి రమేష్, ఎక్కాల కన్నా, బద్దుల ఓం ప్రకాష్‌యాదవ్, దూసరి శ్రీనివాస్‌గౌడ్‌లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌పై వ్యతిరేకత వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో ఎమ్మెల్యే తమతో వ్యవహరించిన తీరును మంత్రి తలసానికి వివరించారు. ఎమ్మెల్యే పట్ల అధిష్టానం పునరాలోచించాలని వారు కోరారు. సీనియర్ నాయకులు తోలుకునూరి కృష్ణగౌడ్, గిరిధర్‌గౌడ్, మురళీకృష్ణ, నగేష్‌గౌడ్ తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన మైనార్టీల్లోని చేతివృత్తిదారులు, చిరువ్యాపారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పథకం కింద అర్హులైన మైనార్టీలకు రూ.లక్ష సాయం అందజేశారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, 9ఏళ్లలో మైనార్టీల సంక్షేమానికి రూ.15 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. గాంధీనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులున్నారు.

బక్కి వెంకటయ్యకు అభినందన



సన్మానిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా, ఎర్రం శ్రీనివాస్



నగర గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి

చిక్కడపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన బక్కి వెంకటయ్యను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తాలు మర్యాదపూర్వకంగా కలసి బుధవారం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. డివిజన్ కోశాధికారి ఎం.బీ కృష్ణ, దుర్గేష్ తదితరులున్నారు.

- నగర గ్రంథాలయ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి, కార్యదర్శి పద్మజలు మర్యాదపూర్వకంగా కలసి వెంకటయ్యను బుధవారం కలిసి అభినందించారు. తెలంగాణ జిల్లా గ్రంథాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అయోధ్య, హరిబాబు, రామ్మోహన్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు అభినందనల వెల్లువ.

మహిళాబిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలి



ఎంపీ సుప్రియ సూలేకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ: మహిళాబిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బిహార్ రాష్ట్ర తరహాలోనే బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల రెండోవారంలో హైదరాబాద్‌లో పదివేల మంది బీసీ మహిళా ప్రతినిధులతో ×బీసీ మహిళల జంగ్ సైరన్‌ె పేరుతో జాతీయ ఓబీసీ మహిళ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం బుధవారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరత్ పవార్ కుమార్తె, ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు, ఎంపీ సుప్రియ సూలేను కలిసి జాతీయ ఓబీసీ మహిళాసభకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనికిక ఆమె హాజరవుతారని హామీ ఇచ్చారని సమాచారం. జాతీయ ఓబీసీ మహిళా సభ సమావేశంలో దేశవ్యాప్తంగా మహిళాబిల్లులో ఓబీసీ మహిళలకు సబ్‌కోటా సాధించే దిశగా ఒక రాజకీయ కార్యాచరణ ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడానికి కార్యచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రొఫెసర్ భభన్ రామ్‌తైవాడే, శ్యాంకుర్మ, తాటికొండ విక్రమ్‌గౌడ్, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, సింగం నగేష్, జాజుల భాస్కర్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం

చిక్కడపల్లి: పనిమీద బయటికి వెళ్తున్నానని, గంటలో తిరిగొస్తానని చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ , ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌కు చెందిన బర్తాపురం వెంకటేష్ (28), మమత భార్యాభర్తలు, వెంకటేష్ గతంలో మద్యానికి బానిసై, కొంతకాలం క్రితం మానసిక సమస్య కోసం ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. కాగా ఇటీవల నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్డు బస్‌భవన్ వద్ద ఉన్న సెవెన్‌హిల్స్ ప్రింటింగ్‌ప్రెస్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 22న డ్యూటీకి వెళ్లిన అతడు నైట్ డ్యూటీ ముగించుకుని వచ్చి 23న విశ్రాంతి తీసుకున్నాడు. 24న ఉదయం 11 గంటలకు పనిమీద వెళ్తున్నానని చెప్పిన తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం భార్య మమత చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో పైపులైన్ పునరుద్ధరణ పనులు

రూ. 32 లక్షలతో నూతన పనులకు శంకుస్థాపన



న్యూ నల్లకుంటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రత్యేక కార్యాచరణతో నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధీకరిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ గణపతి వీరాంజనేయ దేవాలయం వీధిలో సుమారు రూ. 32 లక్షలతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ పునరుద్ధరణ పనులకు స్థానిక కార్పొరేటర్ వై. అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు.

- బస్తీలు, కాలనీలలో దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ పైపులైన్లు చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో నిత్యం మురుగు, కలుషిత నీటి సమస్యలు తలెత్తేవన్నారు.
- ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు రోజూ ఆయా బస్తీలలో పాదయాత్ర చేయడంతోనే పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు.
- నియోజకవర్గంలో చాలా వరకు నూతన డ్రైనేజీ పైపులైన్లు వేయించానని, డ్రైనేజీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అవసరమైన చోట్ల నూతన డ్రైనేజీ పైపులైన్లు వేయిస్తానని వివరించారు. జలమండలి అధికారులు ప్రవీణ్, రోహిత్, బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు పులిజాల గెల్వయ్య, గోనే ప్రదీప్‌రావు, ఎం. భూపతినాథ్, శంకర్, భాస్కర్‌గౌడ్, ఇర్ఫానా సుల్తానా, క్రిసోలైట్, కూర నరేందర్, ఎస్.మూర్తి, రఘురామ్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, నాయకులు ఎంటీ. కిశోర్‌కుమార్, కేజే బాబు, మురళి, టీఆర్టీ మహేష్, సాయిమోహన్, కె. గోవర్ధన్‌రెడ్డి, మధుయాదవ్, మధుసూదన్ పాల్గొన్నారు.

కాలనీలో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే..

వివిధ శాఖల అధికారులతో కలిసి న్యూ నల్లకుంటలో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే స్థానికులతో చిట్‌చాట్ చేశారు. కాలనీలోని వీధి వీధి తిరుగుతూ అపార్టుమెంట్ వాసులు, స్థానిక ప్రజలకు కలిశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

- కాలనీలో కోతుల బెడద అధికంగా ఉందని, కోతుల నివారణకై యానిమల్ హస్బండరీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.
- అంతర్గత వీధుల్లో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖ అధికారులు సిబ్బందిని రప్పించి ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. కాలనీలో ఏ విధమైన ప్రజా సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, తద్వారా వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.